www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 7 నవంబర్ 2022

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

సర్పంచ్ చొరవతో కల్వర్ట్ నిర్మాణం

ప్రజాశక్తి -రామచంద్రపురం

హసన్ బాద గ్రామ శివారు ద్రాక్షారామ వైపు వెళ్తున్న మార్గంలో రోడ్డు పక్కన కల్వర్ట్ ఒక వైపు పూర్తిగా కూలి పోయి ప్రమాదకరంగా తయారైంది. హసన్ బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఎంపిటిసి సభ్యురాలు దేవి ఈ సమస్యను ఆర్ అండ్‌బి అధికారులకు, మంత్రి వేణుకు వివరించి కూలిన కల్వర్ట్‌ను ఆధునికీ కరించారు. సర్పంచ్ సతీష్ రావు కల్వర్ట్ పనులను పరిశీలించి మంత్రి వేణుకి, ఆర్అండ్‌బి అధికారులకు కృజ్ఞతలు తెలియజేశారు.



కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ సతీష్

మొక్కుబడిగా పౌరసరఫరా

- చౌక ధరల దుకాణం వద్ద బియ్యం మాత్రేమ సరఫరా
- పంచదార, కందిపప్పు కట్ ?

ప్రజాశక్తి -రామచంద్రపురం

సామాన్య పేద ప్రజలకు నిత్యావసర సరుకులు తక్కువ ధరలకు అందించాలని భారత ప్రభుత్వం 1955లో నిత్యావసర సరుకుల చట్టాన్ని రూపొందించింది. దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేదలకు తక్కువ ధరలకే సరుకులు అందించేందుకు 1974లో ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. మొదట్లో బియ్యం, కిరోసిన్, వంటనూనె, పంచదార వంటి నిత్యావసర సరుకులను పౌరసరఫరాల విభాగం ద్వారా చౌక ధరల దుకాణాలకు పంపిణీ చేశారు. 2019లో సుమారు 16 సర్కిల్‌ను చౌక ధరల దుకాణాల ద్వారా పేదలకు అందించారు. వీటిలో బియ్యం, పంచదార, కందిపప్పు, చింతపండు వంటనూనె, పసుపు, ఉప్పు, మినప్పప్పు, శనగపప్పు గోధుమలు, బెల్లం వంటి సరుకులను అప్పటి సిఎం కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో సరఫరా అయ్యేది రాను రాను చౌక ధరల దుకాణంలో ఇచ్చే సరుకులను తగ్గిస్తూ వచ్చారు గత ఏడాది నుంచి వీటిని ఇంటి వద్దకే సరుకులు పేరుతో కేవలం బియ్యం కందిపప్పు పంచదారకు పరిమితి చేశారు. ఇటీవల రెండు నెలలుగా పంచదారను కట్ చేసి బియ్యం కందిపప్పు మాత్రమే సరఫరా చేస్తున్నారు ఇక నవంబర్ నెలలో కందిపప్పు పంచదార కూడా కట్ చేసి బియ్యం మాత్రమే మొక్కుబడిగా సరఫరా చేస్తున్నారు. బయటి మార్కెట్లో నిత్యవసర సరుకులు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో సామాన్యులకు ఇచ్చే సరుకులను తూతూ మంత్రంగా బియ్యానికి పరిమితం చేయడంపై సామాన్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి వద్దకే నిత్యావసరకులు నాణ్యమైన సరుకులు బోర్డులు పెట్టుకొని కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేయడంతో సామాన్యులు పెదవి విరిస్తున్నారు. ప్రభుత్వం దీనిపై దష్టి సారించి పేదలకు ఉపయోగపడే నిత్యావసర సరుకులు అన్ని చౌక ధరల దుకాణాల ద్వారా సరఫరా చేసి తద్వారా బయట మార్కెట్లో ధరలు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు.



చౌకధర దుకాణం వద్ద సరుకులు ఇస్తున్న దృశ్యం(ఫైల్ ఫొటో)

తహాశీల్దార్ వివరణ

నిత్యావసర సరుకులు సరఫరాలో కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారని తహాశీల్దార్ వైద్యనాథ్ శర్మను వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ చౌక ధరల దుకాణాలకు ఏ సరుకులు అయితే వాటిని పంపిణీ చేస్తారని పంచదార, కందిపప్పు ఎందుకు ఆగిపోయిందో తెలుసుకుంటానని వివరించారు.

ఎంఎస్ఒ వివరణ

చౌక ధరల దుకాణాలకు కేవలం బియ్యం మాత్రమే సరఫరా అవుతుందని మండల సివిల్ సప్లై అధికారులు ఎస్‌కె.ఆలీషాను వివరణ కోరగా కందిపప్పుకు డీలర్లు డీడీలు చెల్లించాలనన్నారు. చెల్లించిన దుకాణాలకు మాత్రమే కందిపప్పు సరఫరా అవుతుందని అన్నారు. అదేవిధంగా పంచదార రెండు నెలలుగా సప్లై కావడం లేదని దీనికి సంబంధించిన వివరాలు జిల్లా అధికారులకు తెలుస్తాయని ప్రస్తుతం బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని తెలియజేశారు.



యంత్రాలతో ముమ్మరంగా సాగుతున్న వరికోతలు

ముమ్మరంగా వరి కోతలు

- సుమారుగా 11 వేల ఎకరాల్లో వరి సాగు
- ఎకరాకు 25 బస్తాల వరకు దిగుబడి
- వరి కోత యంత్రాల వినియోగం

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక సబ్ డివిజన్ పరిధిలో స్థానిక మండలానికి చెందిన పలు గ్రామాలో వరి కోతలు ముమ్మరంగా ప్రారంభించారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారుగా 11వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఈ ఏడాది తొలకరిలో 90 శాతం రైతులు 1121 స్వర్ణరకాన్ని సాగుచేశారు. అలాగే విత్తన రకాల వరకు 10 శాతం మేరకు పండించారు. గత దాళ్వా సీజన్లో ఆశించినంతగా దిగుబడి రాకపోవడంతో ఈ ఏడాది తొలకరి పైనే రైతులు ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. అయితే ఈ సీజన్ లోను ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదని రైతులు చెబుతున్నారు. దిగుబడి వస్తే రబీలో చేసిన అప్పులు తీరుతాయని అనుకున్న రైతన్న నిరాశ చెందుతున్నారు. ప్రస్తుతం వరికోత యంత్రానికి గంటకు రూ.2,400 తీసుకుం టున్నారని రైతులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో ఎకరానికి 20 నుంచి 25 బస్తాలు వరకు మాత్రమే దిగుబడి వస్తుందన్నారు. వ్యవసాయం చేసేందుకు రానున్న రోజుల్లో రైతులు ముందుకు వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

వాతావరణంలో మార్పులతో ఆందోళన

వారం రోజులుగా ఉదయం పూట ఎండ, మధ్యాహ్నం నుంచి మబ్బులు పట్టడంతో చేతికొచ్చిన వరిపంట నేలపాలయ్యే ప్రమాదం ఉందని రైతుల్లో ఆందోళన నెలకొన్న మాట వాస్తవమే. వాతావరణంలో మార్పుల కారణంగా ఎప్పుడు వర్షం వస్తుందోననే భయంతో రైతుల్లో ఆందోళన ఉంది. ఇప్పటికే మండలంలో ముందస్తుగా నాట్లు వేసిన వరి పొలాలు కోతకు రావడంతో సుమారు 400 ఎకరాల వరకు కోతలు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు ఎడిఎ కె.నాగేశ్వరరావు, ఎఒ లక్ష్మీ లావణ్య తెలిపారు. పచ్చి ధాన్యాన్ని కోయడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వరి పంట కోతకు వచ్చాకే యంత్రాలతో కోయాలని వారు సూచించారు.

ఆలయాల్లో విరాళాలు అందజేత



ద్రాక్షారామ భీమేశ్వర ఆలయంలో విరాళం ఇస్తున్న దాతలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో వేర్వేరు ఆలయాల్లో యాత్రికులు విరాళాలు ఆదివారం అందజేశారు.

భీమేశ్వరాలయానికి రూ.1. లక్ష విరాళం

రామచంద్రపురం ప్రసిద్ధ పంచరామ క్షేత్రం ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి రూ.1లక్ష 116లు విరాళంగా అందజేశారు. రాజమహేంద్రవరం టి.నగర్ కు చెందిన వేలువలి అగస్త్య సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం ఆయన సోదరీమణులు సీతా మహాలక్ష్మి, అనంతపద్మజలు విరాళాన్ని ఆలయ ఇఒ.

అయినవిల్లిలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అయినవిల్లి అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి నిత్యాన్నదాన నిధికి ఏలూరుకు చెందిన భమిడిపాటి నరసింహ శాస్త్రి కుటుంబం



అయినవిల్లిలో దాతలకు స్వామి వారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆదివారం రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు ఇఒ సతీష్ రాజు తెలిపారు. దాత కుటుంబం స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు.

100 మందికి మంకీ క్యాప్‌ల పంపిణీ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామం మ్యాజిక్ హౌస్ వద్ద ఆదివారం వందమంది వద్దులకు వికలాంగులకు మంకీ క్యాప్‌లు, రగ్గులు పంపిణీ చేశారు. రావులపాలెంకు చెందిన విక్టరీ గ్రూప్స్ అధినేత డాక్టర్ విక్టరీ వెంకట్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కర్రి నాగ సత్యనారాయణ రెడ్డి, అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు . కార్య క్రమం లో బద్రీ, అన్నపూర్ణ, తేజశ్రీ లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

ప్రజాశక్తి-రామచంద్రపురం

పంచారామ క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పరంపర ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో గుడి సంబరాలు పేరిట భారతీయ సాంప్రదాయంలో భరతనాట్యం, కూచిపూడి నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సాంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. ప్రాచీన సాంప్రదాయాలను కలలను ప్రోత్సహిస్తూ పరంపర ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు


ప్రజా సంకల్పయాత్రకు ఐదేళ్లు పూర్తి

ప్రజాశక్తి -అమలాపురం

ముఖ్యమంత్రి సిఎం జగన్ ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించి నేటికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా అమలాపురం ఎంపీ చింతా అనురాధ అల్లవరం మండలం కోడూరుపాడు గ్రామంలోని వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజా సంకల్ప యాత్ర ఐదేళ్ల వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు కొనుకు గౌతమి, ఎంపిపి ఇళ్ల శేషారావు, పార్టీ మండల అధ్యక్షులు కొనుకు బాపూజీ, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ఎంపీ అనురాధ



ఉప్పలగుప్తంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

వైసిపి శ్రేణుల సంబరాలు

ఉప్పలగుప్తం ప్రజాసంకల్ప యాత్ర కు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఉప్పలగుప్తంలో వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యాన ఆ పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్ర రావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, దంగేటి దొరబాబు, ఊటాల రామాంజ నేయులు, పోతుమూడి కొండ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో ప్రయోజనాల పరిరక్షణ

ప్రజాశక్తి -రామచంద్రపురం

దళిత ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడేందుకు ఉద్యోగులంతా ఏకమవ్వాలని ఎపి షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల నకుల రాజు పిలుపు నిచ్చారు. రామచంద్రపురం మండలంలో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం సమావేశం మద్దాల బాపూజీ అధ్య క్షతన జరిగింది. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగారాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. ఆయా నిధులు దళితులు అందరికీ అందేలా కృషి చేయాలనీ కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. సత్య నారాయణ మాట్లాడుతూ అంబేద్కర్ నడిచిన పూనీతమైన నేల అని అంబేద్కర్ స్ఫూర్తితో ఉద్యోగుల ప్రయోజనాలు కోసం పనిచేయాలన్నారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సుధాకర్, ప్రదీప్‌లు మాట్లాడుతూ ఉద్యోగులు ప్రయోజనాలే కాకుండా దళిత పేటలలో ప్రజల సమస్యలపై కూడా కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ముందుగా నాయకులు అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కమిటీ సభ్యులు నాగబత్తు ల శ్రీను వందన సంర్పణ చేశారు. కార్యక్రమం లో అమలాపురం యూనిట్ ప్రెసిడెంట్ ప్రసాద్ పాల్గొన్నారు. ఎన్నికల పరిశీలకులుగా సంఘం జిల్లా అధ్యక్షులు బి.నకుల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బంగారాజు వ్యవహారించారు.



సమావేశంలో పాల్గొన్న నకుల రాజు తదితరులు



వైద్య సేవలను ప్రారంభించిన ఎంఎల్ఎ వేగుళ్ల

'లయన్స్' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-మండపేట

మండపేట లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక సత్య శ్రీ రోడ్డులో లయన్స్ క్లబ్ లో అధ్యక్షులు గుండు తాతరాజు అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలన్నారు. తాతరాజు మాట్లాడుతూ జనరల్ వ్యాధులు, హార్ట్, బోన్స్, గైనకాలజిస్ట్, స్కిన్ కు సంబంధించిన ఐదు విభాగాలకు చెందిన డాక్టర్లు వైద్య సేవలు సుమారు 700 మందిని పరీక్షించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ లయన్ ఎల్‌వి.నాగేంద్రబాబు, కోశాధికారి లయన్ చెన్న రాంబాబు, లయన్ కొనే వీర్రాజు, ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి ఆలయానికి జనరేట్ బహూకరణ



జనరేటర్‌ను ప్రారంభిస్తున్న వాసురాజు

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మురమళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న వీరేశ్వరస్వామి ఆలయానికి భక్తుడు సౌండ్ ప్రూఫ్ జనరేటర్‌ను ఆదివారం బహూకరించారు. హైదరాబాద్ కు చెందిన డాక్టర్ మాచిరాజు వెంకటసత్య సర్వేశ్వర సాయిరాం, ప్రణీత దంపతులు రూ.4 లక్షలు విలువచేసే 20 కెవిఎ సామర్థ్యం కలిగిన 3 ఫేజ్ జనరేటర్‌ను చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఇఒ మాచిరాజు లక్ష్మీనారాయణ ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా దాతను పలువురు అభినందించారు

'షారోన్' సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - ఆలమూరు

బడుగువానిలంకలో బైబిల్ మిషన్ షారోను ప్రార్థనా మందిరం పాస్టర్ రెవరెండ్ పి.రత్నాకర్ రావు దంపతుల సేవలు ప్రశంసనీయమని ఉప సర్పంచ్ పినమాల జ్యోతి, వైసిపి నేత పినమాల తాతాజీ అన్నారు. అనంతరం రత్నాకర్ రావు ఘనంగా సన్మానించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ వన సమారాధన బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అమలాపురం

స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో ఈనెల 13న జరగనున్న శెట్టిబలిజ వన సమారాధనకు సంబంధించిన బ్రోచర్‌ను ఆదివారము ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ సంఘం కన్వీనర్ కుడిపూడి సూర్య నారాయణరావు ఆవిష్కరి ంచారు. కార్యక్రమంలో ఆరు మండలాలకు చెందిన శెట్టిబలిజి సంఘ పెద్దలు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, సంసాని బుల్లినాని,మట్టపర్తి నాగేంద్ర ,రెడ్డి సత్యనారాయణ, వాసంశెట్టి తాతాజీ, విత్తనాల నాగభూషణం, గుత్తుల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణరావు

టిడిపిలో చేరిన ఎంబిసి యువత

ప్రజాశక్తి -అయినవిల్లి

పలువురు ఎంబిసి (మోస్ట్ బ్యాక్ వర్డ్ క్లాస్) యువకులు రెడ్డి సుబ్రహ్మణ్యం, టిడిపి పార్లమెంటరీ అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి అధ్యక్షతన ఆదివారం ఆ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన పెంద్ర ప్రభు, వారి మిత్రులను కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్య అతిథులుగా అయినవిల్లి మండల పార్టీ అధ్యక్షులు చిట్టూరి శ్రీని వాస్, ప్రధాన కార్యదర్శి కుడుపూడి బుజ్జి, రాష్ట్ర బిసి సాధికార సమితి ఎంబిసి కన్వీనర్ పెంద్ర రమేష్, రాష్ట్ర ఎంబిసి కమిటీ సభ్యులు ఎడ్లపల్లి తుక్కియ్య సమక్షంలో అయినవిల్లి, అంబాజీపేట మండలాలకు చెందిన ఎంబిసి యువత టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండు వాలు వేసి ఆహ్వానించారు. బత్తుల ఎర్రయ్య, యడ్లపల్లి రాముడు, బత్తుల లక్ష్మణ్, ధనకొండ దాసు, మీసాల శ్రీను, బొడ్డు ప్రసాద్, పెంద్ర ఏసు, పెంద్ర రాజు,పెంద్ర దుర్గా ప్రసాద్, వి.హరీష్ తది తరులు టిడిపిలోచేరారు. కార్యక్రమంలో గుబ్బల మూర్తి, మాజీ ఎంపిటిసి సభ్యుడు దొనకొండ శ్రీను పాల్గొన్నారు.




పార్టీలో చేరిన ఎంబిసి యువకులతో నాయకులు

మంత్రి విశ్వరూప్‌నకు నాయకుల పరామర్శ

ప్రజాశక్తి ఉప్పలగుప్తం

ముంబైలోగుండె శస్త్ర చికిత్స చేయించుకుని హైదరాబాద్‌లో ఆయన ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్న మంత్రి పినిపే విశ్వరూప్‌ను, ఆయన సతీమణి బేబీ మీనాక్షిలను గొల్లవిల్లి కి చెందిన వైసిపి గ్రామ కమిటి అధ్యక్షుడు బడుగు గణేష్, వికలాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సూదా లక్ష్మీనారాయణ, పిఎంసి చైర్మన్ దొనిపాటి రమా వెంకటరమణలు ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఎస్.యానాం కు చెందిన నాయకులు జోగి రాజా,లంకే సహదేవుడు, బడుగు రామచంద్రరావు ఓలేటి రమణ, మల్లాడి చంద్రశేఖర్ తదితరులు మంత్రి విశ్వరూప్ ను పరామర్శించారు.



పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

బడుగువానిలంకలో పుంత రోడ్లకు మరమ్మతులు

ప్రజాశక్తి - ఆలమూరు

బడుగువానిలంక నుంచి లంక పొలాలకు వెళ్లే పుంత రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. గోదావరి వరదలకు ఆ రోడ్లన్నీ గోతుల పడ్డాయి. ఈ గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు నాలుగువేల ఎకరాల పంట భూమి ఉండడంతో రైతులు ఈ పుంత రోడ్డు ద్వారానే తమ పొలాలకు వెళ్లాలి. అలాగే వారు పండించిన ఉత్పత్తులను మార్కెట్కు తరలించడానికి ఇబ్బందులు గురవడంతో రైతులందరూ సర్పంచ్ దూలం వెంకటలక్ష్మికి, ఆమె భర్త వైసిపి నేత దూలం సత్తిబాబు దృష్టికి తీసుకుని వెళ్లారు. స్పందించిన వారు పుంత రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చాలంటూ కార్యదర్శి యు.సుప్రియకి తెలియజేశారు. దీంతో వైస్ సర్పంచ్ పినమాల జ్యోతి, వైసిపి నాయకులు పినమాల తాతాజీ, వీరా రాజు, కటారి గంగరాజు, వారా శ్రీధర్ సమక్షంలో యుద్ధ ప్రాతిపదికపై యంత్రాల సాయంతో గుంతలను పూడ్చారు. అనంతరం తుప్పలను తొలగించే ప్రక్రియ చేపట్టారు.




పనులు పర్యవేక్షిస్తున్న కార్యదర్శి సుప్రియ

బ్యాడ్మింటన్‌లో 'మోడరన్' విద్యార్థి సత్తా

ప్రజాశక్తి-రామచంద్రపురం

ముంబైలో గత నెల అక్టోబర్ 31 నుంచి నిర్వహించిన ఇండియా లెవెల్ బ్యాడ్మింటన్-2022 పోటీల్లో మోడరన్ విద్యాసంస్థలో 8వ తరగతి చదువుతున్న బోను అభిషేక్ బాలుర డబుల్స్ కేటగిరీలో సత్తా చాటి ప్రథమ స్థానం దక్కించుకున్నాడు. విజేతగా నిలిచిన అభిషేక్‌కు మోడరన్ అధినేత లయన్ జివి.రావు. అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి టోర్న మెంట్లోను అభిషేక్ విజేతగా నిలుస్తూ విజయానికి మారుపేరుగా నిలవడం, అతని తల్లిదండ్రులకు, మోడరన్ విద్యాసంస్థలకు కూడా గౌరవమన్నారు. ఈ విజయ పరంపర నిరంతరం కొనసాగి అభిషేక్ క్రీడా ప్రపంచం గర్వించదగ్గ క్రీడాకారుడకావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు.సిబ్బంది పాల్గొన్నారు.




పతకాలతో అభిషేక్ తదితరులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -మండపేట

ఏడిదలో పాత విద్యుత్ వైర్లు స్థానంలో కొత్తవి అమర్చనున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఏడిద, ఏడిద సీతానగరం గ్రామాల్లో సరఫరాకు అంత రాయం కలుగుతుందని ఆ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీ ధర వర్మ ఆదివారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్టూ'నిజం'



పన్నుల రూపంలో మీరే చెల్లించాలి..!!


మొక్కలను పంపిణీ చేస్తున్న సంఘ సభ్యులు

వన సమారాధనలో మొక్కల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వివిధ గ్రామాలలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సామాజిక వర్గాల వారీగా వన సమారాధనలు ఘనంగా నిర్వహించారు. పాలంగి షిరిడి సాయిబాబా ఆలయ సమీపంలో పాలంగి శ్రీ వాసవి మాత ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తులసి, ఉసిరి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు కొర్లేపర సుబ్బారావు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతి ఇంట ఉండేలా, ఆరోగ్యాన్ని చేకూర్చే ఉసిరి, తులసి మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సింహాద్రి గుప్త, సభ్యులు ముత్తా రాజేశ్వర రావు, పచ్చిపులుసు పుల్లేశ్వరరావు, అత్యం మూర్తి, గమిని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తాడిపర్రు గ్రామంలో బ్రాహ్మణులు సమారాధన నిర్వహించారు.


స్థానికులతో మాట్లాడుతున్న మద్దిపాటి

బాధిత కుటుంబాలకు మద్దిపాటి పరామర్శ

ప్రజాశక్తి-గోపాలపురం

టిడిపి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంతో బాధ్యతగా పనిచేయాలని పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు పిలుపునిచ్చారు. గోపాలపురంలో ఇటీవల మృతి చెందిన మాజీ జడ్పిటిసి కొప్పాక అబ్బులు, సీనియర్ నాయకులు ముప్పిడి సుందర్రావు, షేక్ హుమాయున్ మనవరాలు మృతి చెందగా వారి కుటుంబాలను స్థానిక నాయకులతో కలిసి మద్దిపాటి పరామర్శించారు. అనంతరం ఆయన స్థానిక యువతతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో యువత రాజ్యాధికారమే ధ్యేయంగా ఐక్యమత్యంతో పని చేయాలని ఆయన సూచించారు. ముందుగా ఎర్రంపల్లేమ్మ గుడి వద్ద పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఈలి శరత్ బాబు, మద్దిపాటి రమేష్, మాజీ సర్పంచ్ తానేటి వీరరాఘవులు, రాపాక జయరాజు, కూనపోం ప్రసాద్ బాబు, కొడవటి గంగరాజు, కొడవటి పెద్ద వెంకటేశ్వరావు పాల్గొన్నారు.


ఉత్సాహంగా కరుటూరి వన సమ్మేళనం

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని తీపర్రు గోదావరి పుష్కర్ ఘాట్ గంటాలమ్మ గుడి ప్రాంతంలో ఆదివారం కరటూరి వెల్ఫేర్ అసోసియేషన్ తణుకు వారి వన సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. ఆత్మీయ సమ్మేళనం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు కుటుంబ సభ్యులతో ఆటపాటలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆత్మీయతను పంచుకున్నారు. కరటూరి కుటుంబం జిల్లాలో పలు ప్రాంతాల నుండి కాక ఇతర రాష్ట్రాలలో పలు విభాగాల్లో స్థిరపడిన డాక్టర్స్ ఇంజనీర్స్ నాయకులు కార్తీక వన సమారాధన ఆత్మీయ సమ్మేళనానికి వచ్చారు. సుమారు 1500 మంది వరకు కుటుంబ సమేతంగా వన సమారాధనలో పాల్గొన్నారు. సుధీర ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో వచ్చి ఆప్యాయత అనురాగాలతో సాయంత్రం ఆటపాటలు క్విజ్ పోటీలతో గోదావరి పరీవాహక ప్రాంతంలో మిత్రులతో గడిపి ఆప్యాయతను చాటుకున్నారు.

ఇంధన వనరుల వినియోగంపై అవగాహన

ఎన్‌రెడ్‌క్యాప్ పీడీ రామరాజు



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఇంధనవనరుల వినియోగంపై ప్రజలు అవగాహన పెంచుకుని వాటిని ఉపయోగించుకోవాలని న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్ రెడ్ క్యాప్) జిల్లా పీడీ పివి.రామరాజు అన్నారు. తరగని ఇంధన వనరులను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వ సబ్సిడీలతో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. సోలార్ వీధి దీపాలు, సోలార్ ఇంటి దీపాలను విద్యుత్ సదుపాయం లేని చోట్ల సైతం కూడా అమర్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటిని అటవీ ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పలు అంశాలను ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

సోలార్ ద్వారా ఉపయోగాలు ఏమిటి.?

సోలార్ పలకలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వినియోగదారులకు విద్యుత్ పెట్టుబడి ఆదా అవుతుంది. తద్వారా గ్రీన్ ఎనర్జీ వస్తుంది. వాతావరణంలో కాలుష్యం కూడా తగ్గుతుంది. సోలార్ ద్వారా మన విద్యుత్ మనమే పొదుపు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. ఒకసారి ఏర్పాటు చేసుకున్న సోలార్ పలకలు 25 సంవత్సరాల వరకు పనిచేస్తాయి.

ఒక గహవినియోగానికి ఎంత ఖర్చు అవుతుంది.?

ఒక సాధారణ గహానికి సోలార్ ఏర్పాటుకు సుమారు రూ.1.5 లక్షల పెట్టుబడి ఖర్చవుతుంది. 3 కిలోవాట్స్ యూనిట్స్ కరెంటు అవసరం ఉంటుంది. ఇలా విద్యుత్ ఆదా వల్ల నాలుగేళ్లలోనే పెట్టుబడి ఖర్చు మిగులుతుంది. ఒక కిలోవాట్ కరెంటు కోసం 100 అడుగుల పలకలను ఏర్పాటు చేస్తే సరిపోతుంది. నీడ పడని ఏరియాలో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు.?

జిల్లాలో మూడేళ్ల క్రితం 10 భవనాలకు మా సంస్థ ద్వారా సోలార్ సిస్టం ఏర్పాటు చేశాం. కిర్లంపూడి మండలం వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అల్లవరం మండలం ఓడలరేవు జిల్లా పరిషత్ పాఠశాలకు, శంఖవరం మండలం మోడల్ స్కూల్, రాజమహేంద్రవరంలో కోర్టు కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశాం.

సోలార్ వీధి లైట్ల పనితీరు ఎలా ఉంది.?

పుదుచ్చేరి రాష్ట్రం యానాం, పి.గన్నవరం మండలం పశువుల్లంకలలో సుమారు 250 సోలార్ స్ట్రీట్ లైట్లను గతంలో ఏర్పాటు చేసాం. ఒక్కో దానికి సుమారు రూ.21 వేల ఖర్చుతో వీటిని అమర్చాము. 12 గంటలు వెలిగి



ఉండేలా టైమర్ బాక్స్‌లను ఏర్పాటు చేశాము. ఎవరైనా ఆసక్తి ఉన్న వారు తమను సంప్రదిస్తే నెడ్ క్యాప్ సంస్థ ద్వారా వీటిని అమరుస్తాము.

విద్యుత్ వాహనాలు పని తీరు ఎలా ఉంటుంది.?

జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 10 వేల విద్యుత్ వాహనాలు (ద్విచక్ర, కార్లు) ఉన్నాయి. ఒకసారి ఛార్జ్ చేస్తే 400 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. ఇప్పటి వరకూ కారుకు 6 గంటల పాటు ఛార్జ్ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు 45 నిమిషాల్లోనే చేయవచ్చు. త్వరలో ఎంపిక చేసిన కొన్ని చోట్ల ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. వీటి ఏర్పాటుకు తమ సంస్థ సహకారం ద్వారా ప్రైవేటు వ్యక్తులు ముందుకు వస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఎన్ని ప్రాంతాల్లో స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు.?

జిల్లాలోని 13 ప్రాంతాల్లో విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఎన్ రెడ్ క్యాప్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. తొలుత ఆర్‌టిసి బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

నీట మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మతి చెందిన సంఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ జి. వెంకటేశ్వరరావు కథనం ప్రకారం ఎన్.కొత్తపల్లికి చెందిన అంగాని సత్యనారాయణ (45) వివాహితుడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్యనారాయణ గ్రామంలోని అల్లిపర్ర వద్ద మురుగు కాలువలో చేపల కట్టు దగ్గరకు శనివారం సాయంత్రం వెళ్లి ఉదయం వరకు రాకపోవడంతో కుటుంబీకులు అతని కోసం గాలించారు. చేపల కట్టు వద్ద సత్యనారాయణ నీట మునిగి శవమై కనిపించాడు. మతుని కుమారుడు గోవిందరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీడీ యాక్ట్‌లో జైలు శిక్ష

ప్రజాశక్తి - సీతానగరం

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాలతో పలు సారా కేసుల్లో నిందితులకు జైలు శిక్ష విధించారు. ఆదివారం కోరుకొండ ఎక్సైజ్ సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సారా కేసుల్లో పలుమార్లు పట్టుబడి, మరలా సారా అమ్మకాలకు పాల్పడుతున్నందుకు ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన తలారి బేబీ పై ఆదివారం పిడి యాక్ట్‌ను అమలు చేశారు. సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ తలారి బేబి పై ఒక్క సంవత్సరం జైలు శిక్ష అమలులో ఉంటుందన్నారు. కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాలలో ఎవరైనా సారా అమ్మకాలు చేయటం, సారా తయారు చేయడం, రవాణా చేయటం చేస్తూ, మానకుండా ఉన్నవారు కఠినమైన శిక్షకు గురవుతారని హెచ్చరించారు.


ల్యాబ్ ప్రారంభోత్సవం

నాణ్యమైన సేవలతో గుర్తింపు

ప్రజాశక్తి-తాళ్లపూడి

వివిధ రకాల వైద్య పరీక్షల కోసం ల్యాబ్‌కు వచ్చే ప్రజలకు మంచి సేవలు అందిస్తూ గుర్తింపు పొందాలని జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ అన్నారు. మండలంలోని ప్రక్కిలంకలో విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన యాపిల్ డయాగ్నస్టిక్ ల్యాబ్‌ను ఆదివారం శ్రీలేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా ల్యాబ్ యజమాని నరేష్ వర్మ మాట్లాడుతూ ప్రజలు వైద్య పరీక్షల కోసం ద్వారా ప్రాంతాలకు వెళ్ళక్కర్లేకుండా అత్యాధునిక యంత్ర పరికరాలతో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌లో గంటల వ్యవధిలోనే రిపోర్టులు అందజేస్తామని అన్నారు. ఈ ప్రారంభోత్సవంలో ఒఎన్‌జిసి ఉద్యోగి ఒబిసి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఎల్ఎస్.రాజు, ఎపి స్టేట్ టెక్నికల్ బోర్డు కార్యాలయ సిబ్బంది ఆర్.బాపిరాజు, రాజానగరం స్టేషన్ ఎఎస్ఐ శ్రీనివాస్, తాళ్లపూడి ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, యాళ్ల బాబూరావు, టిడిపి నాయకులు ఎ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మండపేట


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తోట

మండలంలోని ఏడిద గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఎంఎల్‌ఎ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. ఏడిద సొసైటీలో ప్రారంభోత్సవంలో మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి తోట మాట్లాడుతూ రైతుకు మద్దతు ధర కలిగించేలా ప్రభుత్వం ఎప్పటికప్పుడు నూతన విధానాలు అవలంబిస్తోందన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ తులసి మాట్లాడుతూ 2022-23 ఖరీఫ్‌కు 331 రైతు భరోసా కేంద్రాల ద్వారా 3.53 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా ఉందన్నారు. 100 కేజీల ఏ-గ్రేడ్ ధాన్యం రూ.2060, సాధారణ రకం రూ.2040 చొప్పున కొనుగోలు చేస్తామని తులసి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

కలశాల పూజలో పాల్గొన్న ఎంఎల్‌ఎ చిర్ల

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెం మండలం గోపాలపురంలో నిర్వహించిన కలశాల పూజలో ఎంఎల్‌ఎ, ప్రభుత్వ ఛీఫ్ విప్ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ చిర్ల స్వగృహంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల అయ్యప్ప దీక్షాపరులు వందలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలశాలతో ఊరేగింపు నిర్వహించారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -గోకవరం

మండల కేంద్రమైన గోకవరం రాజా పబ్లిక్ స్కూల్ వెనుక వీధిలో కొంతకాలంగా డ్రైనేజీ లేక అక్కడ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎంపిపి సుంకర శ్రీవల్లి వీరబాబు దృష్టికి ఆ వీధి ప్రజలు తీసుకువచ్చారు. ఈ డ్రైనేజీ సమస్యను స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు దృష్టికి ఎంపిపి తీసుకెళ్లారు. ఎంఎల్ఎ ఆదేశానుసారం ఆదివారం డ్రైనేజీ నిర్మాణానికి సుంకర శ్రీవల్లి వీరబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్‌సి సెల్ కార్యదర్శి వరసల ప్రసాద్, పులపర్తి బుజ్జి, చిటికెల పాండు, పల్లెలు బాబి, శ్రీను పాల్గొన్నారు.

నిలిచిపోయిన ఉపాధి హామీ పనులు

- 640 మంది కూలీల ఎదురుచూపు
- రూ.30 లక్షల పనులు జరగని వైనం
- స్పందించని అధికారులు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -రామచంద్రపురం

ఉపాధి హామీ పనులు గత ఆరు నెలలుగా నిలిచిపోయాయి. ఉపాధి హామీ పనుల కోసం కూలీలు ఎదురుచూస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఉపాధి పథకం ద్వారా పనులు కల్పించి వారికి కొంత సొమ్ము అందించాలని పట్టణ ప్రాంతాలకు వలసలు తగ్గించాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేంద్రం రూపొందించింది. దీనిని అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున 2005లో ప్రారంభించారు. ఈ పథకం ప్రకారం కూలీలకు కనీసం వంద రోజులు పని దినాలు కల్పించాలని పనిలేదని అభ్యర్థించిన కూలికి 14 రోజుల్లో గా పని కల్పించకపోతే కొంత నగదు చెల్లించాలని ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది రాజపురం నియోజకవర్గం లోని తోటపేట గ్రామపంచాయతీ పరిధిలో మే నెల నుండి 6 నెలలుగా ఇక్కడ ఉపాధి హామీ పథకం పనులు నిలిచిపోయాయి ఇక్కడ పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ అభ్యంతరంగా మానివేయడంతో ఇప్పటివరకు పనులు జరగలేదు. గ్రామంలో మొత్తం 32 గ్రూపులు ఉండగా 640 మంది కూలీలు ఉపాధి పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ గ్రామంలో ఆరు నెలలుగా పనులు నిలిచిపోవడంతో కూలీలు పలుమార్లు అధికారుల దష్టికి తీసుకువెళ్లారు. అయినా ఫలితం లేదు దీంతో సుమారు రూ.30 లక్షలు విలువైన పనులు ఎంతవరకు పూర్తి కాలేదు కనీసం కూలీలకు పని కల్పించగా పోవడం వల్ల పరిహారం చెల్లించలేదు. పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి అని కూలీలంతా ఎదురుచూస్తున్నారు. మరో మూడునెలల్లో ఈ ఏడాదిలో ఉపాధి హామీ పనులు పూర్తికావాల్సి ఉండగా ఇప్పటికీ అవి పూర్తికాలేదు. ఎప్పటికైనా అధికారులు స్పందించి తోటపేటలో కూలీలకు పనులు కల్పించాలని, దీనిపై అధికారులు స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్ నియమించాలని దీనికి సీనియర్ మేట్లలో ఒకరిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించే వీలున్నప్పటికీ రాజకీయ నాయకుల వత్తిడితో ఎంతవరకు ఆ పోస్ట్ ని ఖాళీగా ఉంచి కూలీలకు పనులు లేకుండా చేశారని పలువురు ఆరోపిస్తున్నారు.

గ్రామంలో రాజకీయాలను పక్కనపెట్టి వెంటనే ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఎనర్జీఎస్ నిధులు సద్వినియోగం చేయాలని గ్రామస్తులు కూలీలు అధికారులను వేడుకుంటున్నారు.

అధికారులతో మాట్లాడి వివరాలు తెలియజేస్తా

తోటపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు ఆరు నెలలుగా నిలిచిపోవడంతో రామచంద్ర పురం ఎంపిడిఒ కీర్తి స్పందనను వివరణ కోరగా ఆ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేడని దీనివల్ల పనులు నిలిచిపోయాయన్నాఉ. తాను ఇటీవలే విధులకు రావడం వల్ల దీనిపై పూర్తి వివరాలు చెప్పలేనని సోమవారం దీనికి సంబంధించిన అధికారులతో మాట్లాడి వివరణ ఇస్తానని అన్నారు.


జొన్నాడ వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడిన ఊక లారీ

జాతీయ రహదారిపై ఊక లారీ బోల్తా

- డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలు

ప్రజాశక్తి - ఆలమూరు

216 నెంబరు జాతీయ రహదారిపై మండలంలోని జొన్నాడ ఆంజనేయ స్వామి గుడి సమీపంలో ఆదివార ఊక లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపారు. వివరాలు ఇవి.. జొన్నాడ నుంచి ఊకలోడుతో వస్తున్న లారీ జాతీయ రహదారిపైకి వేగంగా వస్తోంది. ఈ క్రమంలో జొన్నాడ వద్ద గల డివైడర్‌ను దాటి రాజమహేంద్రవరం వైపు వెళ్లేందుకు తిరుగుతూ అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ తో సహా అతని ప్రక్కన ఉన్న క్లీనర్ కి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. కాగా లారీ జాతీయ రహదారిపై అడ్డంగా పడినప్పుడు ఇతర వాహనాలు రాలేనందున ప్రమాదం తప్పిందని ఎఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. అలాగే ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం లేకుండా హైవే సిబ్బంది సహాయంతో హైవే పెట్రోలింగ్ పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. అలాగే క్షతగాత్రులను ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ పై తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టారు.


ఎఎస్ఐవెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

నాటికలపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్


నాటికలు, నృత్యాలపై శిక్షణ ఇస్తున్న శ్రీనివాసరావు

సామర్లకోట మండలం మాధవపట్నం జమునానగర్ కాలనీ అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల మందిరంలో విద్యార్థులకు నాటికలు, నృత్యాలపై ప్రజానాట్య మండలి కళాకారులు ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ట్రస్టు కన్వీనరు అంగర గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. ప్రజా నాట్యమండలి నాయకులు జె.శ్రీనివాసరావు బృందం, కల్చరల్ టీమ్ లీడర్ హేమంత్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాల మందిరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



పేరవరం గ్రామంలో అవగాహన ర్యాలీ

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సమాజంలో ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రత్తిపాడు కోర్టు న్యాయమూర్తి కె.భాను పిలుపునిచ్చారు. మండలంలోని పేరవరంలో సర్పంచ్ బేరి వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సుకు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులను వివరించారు. అనంతరం ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బుగతా శివ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్యుని చేతిలో వజ్రాయుధం లాంటిదని అన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం ఆవశ్యకతను ఆయన వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్.వెంకట్రావు, ఆకుల హరిబాబు, పిల్లి బలరాముడు, అవసరాల దేవి, ఎస్ఐ సిహెచ్.విద్యాసాగర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.